www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 12 ఆగస్టు 2024
5
తూర్పుగోదావరి



నేడు జిల్లాకు హోం మంత్రి అనిత రాక

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

రాజమండ్రి సెంట్రల్ జైలు ఎదురుగా నిర్మించిన ప్రిజన్ కేఫ్, బాక్స్ క్రికెట్, తూర్పుగోదావరి జిల్లా సబ్ జైళ్ల అధికారి వారి కార్యాలయం పక్కన నిర్మించిన పెట్రోల్ బంకును ప్రారంభించేందుకు సోమవారం హోం మంత్రి వంగలపూడి అనిత రానున్నారని కేంద్ర కారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ కుమార్ విశ్వజిత్ ఆదివారం నగరానికి చేరుకున్నారన్నారు. సెంట్రల్ జైలులో వికలాంగులకు కృత్రిమ అవయవాలను హోం మంత్రి అందిస్తారనానరు. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ పురంధేశ్వరి, ఎంఎల్ఎలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చియ్యచౌదరి, జడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తదితరులు పాల్గొంటారు.

భయ పెడుతున్న రోడ్డు ప్రమాదాలు

- హద్దులు దాటుతున్న మైనర్లు
- కఠినతరంగా నూతన చట్టాలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు భయాందోళనకు గురి చేస్తున్నారు. అతి వేగం, నిర్లక్ష్యం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మరోవైపు మైనర్లు హద్దు మీరి ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. ఎదుటి వారి ప్రాణాలకు ప్రమాదాన్ని కలిగిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల సంఖ్య ఏటేటా భారీగా పెరిగిపోతోంది. రవాణా, పోలీసు శాఖల అధికారులు అవగాహనా కార్యక్రమాలు చేపట్టినా పరిస్థితిలో మార్పు ఉండటం లేదు. ఈ నేపథ్యంలో నూతనంగా అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలు మరింత కఠినతరంగా ఉన్నాయి. దీంతో రోడ్డు ప్రమాదాలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మైనర్లు వాహనాలు నడిపి యాక్సిడెంట్లు చేస్తే పెద్దవారికి శిక్షలు పడేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. కొత్త చట్టాల ప్రకారం. ఇప్పుడు మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే.. ఏకంగా రూ.25వేల వరకూ జరిమానా విధిస్తారు. దాంతో పాటు 25 ఏళ్ల వయసు వచ్చే వరకు లైసెన్స్ పొందే అవకాశం లేకుండా ఆంక్షలు విధించనున్నారు.

భారీగా పెరిగిన జరిమానాలు



ఈ ఏడాది జనవరిలో దేవరపల్లి మండలంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం(ఫైల్)

జిల్లాలోమొత్తం వాహనాలు 7,85,000 ఉండగా అందులో ద్విచక్రవాహనాలు 5,52,000 ఉన్నాయి. ఈ వాహనాలను అత్యధిక మందియువతే వినియోగిస్తున్నారు. అత్యధిక ప్రమాదాలు ద్విచక్ర వాహనాల వలనే సంభవిస్తున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. యువత, విద్యార్థులు ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారు. రెడ్ లైట్ ఉల్లంఘనకు జరిమానా: రూ.100 నుంచి ప్రస్తుతం రూ.500కు చేరింది. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్‌కు రూ.500 నుంచి ప్రస్తుత జరిమానా: రూ.5,000కు చేరింది. అతి వేగానికి జరిమానా: రూ.400 నుంచి ప్రస్తుత జరిమానా రూ.1000కు చేరింది. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు రూ.2వేల నుంచి జరిమానా: రూ.10వేలకు చేరింది. రేసింగ్, స్పీడింగ్‌కు రూ.500 నుంచి రూ.5వేలు చేశారు.. హెల్మెట్ ధరించకపోతే గతంలో రూ.100 జరిమానా వేసేవారు. ప్రస్తుతం దీన్ని రూ.1000కి పెంచారు. మూడు నెలల పాటు లైసెన్సును రద్దు చేయనున్నారు. సీట్‌బెల్ట్ ధరించనికి వారికి రూ.100 నుంచి జరిమానా రూ.1000కి చేరింది. బైక్‌పై ట్రిపుల్ రైడింగ్‌కు రూ.1,200, ఇన్సూరెన్స్ లేకుండా డ్రైవింగ్‌కు రూ.2వేల చొప్పున జరిమానా విధించనున్నారు.

హద్దు మీరుతున్న మైనర్లు

ఇటీవల కాలంలో జరిగిన పలు రోడ్డు ప్రమాదాలు మైనర్ల వల్లే జరగడం ఆందోళనకు గురి చేస్తుంది. 18 ఏళ్లలోపు కలిగిన పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసు శాఖ చెబుతోంది. ఇటీవల రాజమండ్రి నగరంలో ఒక మైనర్ తన తండ్రి వాహనంపై స్నేహితులతో చక్కర్లు కొట్టాడు. వచ్చీరాని డ్రైవింగ్ చేస్తూ వేగంగా మరో వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఈ బాలునితో పాటు ఎదుటి వాహనంపై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఇలా జిల్లాలో రోజూ ఎదొక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో మైనర్ల పట్ల పోలీసులు సీరియస్ గానే స్పందిస్తున్నారు. మైనర్లతో పాటు వారికి వాహనాలు ఇచ్చిన పెద్దలపైనా కేసులు సమోదు చేస్తున్నారు.

జిల్లాలో గత మూడేళ్లలో జరిగిన వివరాలు...

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2022	926	320	962
2023	852	336	856
2024	380	131	369 (జూన్31)



సదస్సులో మాట్లాడుతున్న యూనియన్ జోనల్ సంయుక్త కార్యదర్శి తిరుపతయ్య

ఉపాధి కల్పనకు నిధులు పెంచాలి

ఎల్ఐసి యూనియన్ జోనల్ సంయుక్త కార్యదర్శి తిరుపతయ్య

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి కల్పనకు మరింత నిధులను పెంచాల్సి ఉందని, అప్పుడే ఉపాధి కల్పన సజావుగా జరుగుతుందని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య సూచించారు. రాజమండ్రి ఎల్ఐసి ఉద్యోగుల సంఘం, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మోడల్ కాలనీలో గల యూనియన్ భవనంలో కేంద్ర బడ్జెట్ – ఉపాధి కల్పన – అవకాశాలు' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు తిరుపతయ్య ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో విద్య, వైద్య మరియు మౌలిక వసతుల ప్రాజెక్టు కోసం ఎక్కువ మొత్తాల్లో కేటాయించడం ద్వారా నైపుణ్యం కలిగిన, నైపుణ్యం లేని కార్మికులకు ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుంది అని అభిప్రాయ పడ్డారు. విద్యార్థులు కూడా బడ్జెట్‌పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బడ్జెట్‌లో ఉపాధి కల్పనకు కేటాయింపులు మరింత పెంచాలన్నారు. ఆలిండియా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ పిలుపు మేరకు ఈ సదస్సును నిర్వహించామని యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ స్వాగత ఉపన్యాసంలో తెలిపారు. సదస్సుకు యూనియన్ అధ్యక్షులు గుబ్బల రాంబాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా, ఎల్ఐసి యూనియన్ నాయకులు ఎ.సుబ్బారావు, ఎస్.గనెయ్య, ఎకె.విశ్వనాథ్, బి.శ్రీనివాస్, ఐవి.సుధాకర్, జి.శ్రీనివాస్, వి.ఈశ్వరరావు, భరణి, సత్యదేవ, శిరీష విజయదుర్గా, పూర్ణచంద్రరావు, సాయిబాబా, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎంఎల్ఎను కలిసిన భూపతిపాలెం ఎస్ఎంసి కమిటీ

ప్రజాశక్తి-గోకవరం

నూతనంగా ఎన్నికైన భూపతిపాలెం గురుకుల పాఠశాల ఎస్ఎంసి కమిటీ చైర్మన్ గల్లా రామచంద్రరావు, వైస్ చైర్మన్ అందే శివవెంకటదుర్గరాజీవ్, కమిటీ సభ్యులు ఆదివారం జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నూతన కమిటీ సభ్యులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ఎంఎల్ఎ దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. గురుకుల పాఠశాలలో డార్మెంటరీ, భోజనశాల, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. కళాశాల ఆవరణలో లైట్లు వెలగడం లేదని, కనీస వసతులు కూడా లేవని తెలిపారు. విద్యుత్ సరఫరా సరిగా ఉండటం లేదన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది తక్కువగా ఉండవల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా రహదారి సౌకర్యం అధ్వానంగా ఉందన్నారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వారిని ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ఒక వాహనాన్ని కూడా ఏర్పాటు చేయించాలని ఎంఎల్ఎను కోరారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు డి.లోవప్రసాద్, ఎన్.వెంకన్నబాబు, సిహెచ్.నాగరాజు, పి.వీరబాబు, టి.ఆనంద్, ఐ.రాజు, టి.అప్పలరాజు, కె.గంగవేణి, బి.బాబి, దాసరి దేవి పాల్గొన్నారు.



ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూతో భూపతిపాలెం గురుకులం కమిటీ సభ్యులు

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ

ప్రజాశక్తి - చాగల్లు

కేరళ రాష్ట్రం వయనాడ్ బాధితుల సహాయార్థం సిపిఎం నాయకులు విరాళాలు సేకరించారు. రూ.5,300 సమకూరాయని నాయకులు తెలిపారు. రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకట సుబ్బారావు, సిపిఎం మండల కార్యదర్శి కెకె.దుర్గారావు, రైతు సంఘం మండల నాయకులు కె.బుద్ధుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు సుందరబాబు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వయనాడ్ బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ముందుకు రావాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో భవనిర్మాణ కార్మికులు సహకరించారు



రైతుల ఆదుకోవాలి

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలంలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పంటలను నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని రైతు సంఘం జిల్లాకన్వీనర్ గారపాటి వెంకటసుబ్బారావు ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే ఎకరాకు రూ.13,500 వరకూ పెట్టుబడి పెట్టారన్నారు. వర్షాలకు మండలంలో 1,500 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందన్నారు. వేసవికాలంలో ఉపాధి హామీ కూలీల ద్వారా పూడికలు తీయించి గుర్రపుడెక్క తొలగించాలన్నారు. మురుగు బోదెలను సర్వే చేయించి ఆక్రమణలు తొలగించాలన్నారు. పంట కాలువల పూడికతీత పనులు చేపట్టాలన్నారు. వర్షాల వల్ల నష్టపోయిన కౌలు రైతులను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని కోరారు.



దేవరపల్లి తహశీల్దార్‌గా రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి తహశీల్దార్‌గా కె.రాజ్యలక్ష్మి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయానికి విచ్చేసిన ఆమెకు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను ఆమె పరిశీలించారు. మండలంలో రెవెన్యూ సమస్యల పరిస్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

రోడ్డును కప్పేస్తున్న తుప్పలు

ప్రయాణికుల ఇబ్బందులు

ప్రజాశక్తి- కడియం

మండలంలోని మురమండ నుంచి దుళ్ల వెళ్ల ప్రధాన రహదారిని తుప్పలు చుట్టుముట్టేస్తున్నాయి. అనేకచోట్ల ప్రమాదకర మలుపులకు తోడు, రోడ్డుకిరువైపులా తుప్పలు విపరీతంగా పెరగడంతో ఈ రోడ్డుపై ప్రయాణం అంటేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నిత్యం నర్సరీలకు సంబంధించిన భారీ వాహనాలు, ఆర్‌టిసి బస్సులు తిరగడంతో కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిసార్లు భారీ వాహనాలు ఎదురుపడ్డ సందర్భాల్లో సమస్య మరీ తీవ్రంగా ఉంటుంది. అధిక లోడులతో భారీ వాహనాలు తిరగడం, సమీప నర్సరీ రైతులు రోడ్డు మార్జిన్లు పూర్తిగా తవ్వేయడంతో ద్విచక్ర, ఆటోల మీదుగా ప్రయాణాలు కొనసాగించే వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. నర్సరీలకు సంబంధించిన భారీ వాహనాలు ఈ రోడ్లు వెంబడి తిరుగుతున్నప్పుడు, రోడ్డు సమీపన గల విద్యుత్ వైర్లు, ట్రాన్స్ ఫార్మర్లు చూసుకొని జాగ్రత్తగా నడపాలని డ్రైవర్లకు, నర్సరీ యజమానులు, మొక్కల ఎగుమతి కూలీలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ భారీ వాహనాలు కారణంగా కొన్ని సార్లు గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలుపదల చేయాల్సి రావడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదకర మలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు, రోడ్డుకిరువైపులా వున్న తుప్పలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే రోడ్డుమార్జిన్లు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలంటున్నారు.



మలుపు వద్ద భారీ వాహనం



మురమండ- దుళ్ల రోడ్డులో పెరిగిపోయిన మొక్కలు



పలువురు జనసేనలో చేరిక

ప్రజాశక్తి-గోకవరం

జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలకు రాష్ట్ర ప్రజలు ఆకర్షితులవుతున్నారని, రానున్న రోజుల్లో పార్టీ మరింత బలం పుంజుకుంటుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. ఆదివారం కామరాజుపేటలో కొమ్మూరు ప్రసాద్, మిట్టపల్లి వరప్రసాద్, మేడిశెట్టి జానకిరామ్, వారి అనుచరులతో జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి రమేష్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి మాట్లాడారు. జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జనసేన నాయకులు గుల్లంపూడి ఆనంద్, మాట్లాడుతూ రానున్న రోజుల్లో పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రిగా చూడాలంటే ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. జనసేన కార్యకర్తలకు, నాయకులకు ఎటువంటి కష్టం వచ్చినా తుమ్మలపల్లి రమేష్ అండగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పదిలం మురళి, గగిని దుర్గాప్రసాద్, ముక్క శ్రీనివాస్, కాకి మణికంఠ, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లా పోలీస్ కార్యాలయంలో గల సిసి కెమెరా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఎస్‌పి నరసింహకిశోర్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంట్రోల్ రూమ్ పనితీరుపై కంట్రోల్ రూమ్ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ జి.ఉమామహేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధులపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లా అంతటా ఉన్న 481 సిసి కెమెరాల పనితీరుపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామన్నారు. వీటి ద్వారా జిల్లాలో నేరాల నియంత్రణకు కృషి చేస్తామని తెలిపారు. జిల్లా అంతటా ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను 24బై7 పర్యవేక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు కూడా తమ ఇల్లు, కార్యాలయాల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీని వల్ల భద్రత, నిఘా పెంచుకోవచ్చని తెలిపారు.

విశాల రాజధాని నిర్మాణం కావాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్‌కు విశాల రాజధాని నిర్మాణం కావాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ పై అనేక కుట్రలు, కుతంత్రాలు జరుగుతున్నాయన్నారు. మన రాష్ట్రంలో మేధావులు కార్పొరేట్ శక్తులుకు, పెట్టందారులకు, వ్యాపార రాజకీయ పార్టిలకు బానిసలుగా జీవిస్తున్నారని విమర్శించారు. ఒకప్పుడు మేధావులు అంటే సమాజానికి , భావితరాలకు ఉపయోగపడేలా ఉండేవారని, నేడు అలాంటి మేధావులు కొంత మంది మేతావులుగాను, చరిత్ర హీనులుగాను, కట్టు బానిసలుగాను బతికేయటానికి అలవాటు పడిపోయారన్నారు. మన మేధావులు అమరావతిని ఏ ప్రామాణికతతో రాజధానిగా ప్రచారం చేసుకుంటున్నారో చెప్పగలరా అని ప్రశ్నించారు. ఒక రాజధాన్ని నిర్మించాలి అంటే 1000 ఏళ్ల భవిష్యత్‌ను అంచనాలు వేయాలన్నారు. కేవలం అటు అనంతపురానికి ఇటు శ్రీకాకుళా నికి మధ్యగా వుంది, అందుకని అక్కడ రాజధాన్ని నిర్మిస్తున్నాము అని మన మేధావులు గాలి కబుర్లు చెప్పున్నారన్నారు. కనీస జ్ఞానం నేటి మన మేధావులకు లేక పోవటం ఆంధ్రుల దురదృష్టంగా బావించాలన్నారు. విశాఖపట్నం పరిసర ప్రాంత జిల్లాలు, రాజమండ్రి చుట్టు పక్కల జిల్లాలు, విజయవాడ , గుంటూరు , ప్రకాశం జిల్లాల అభివృద్ధి, కర్నూల్ అభివృద్ధిపై సమగ్ర ప్రణాళిక , నిధుల కేటాయింపై చట్ట బద్ధమైన అధికారిక ప్రకటన చేయకుండా సంపద మొత్తం అమరావతిపై పెట్టడం తగదన్నారు.

నేడు యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం కలెక్టరేట్‌లో యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా స్థాయి అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించ నున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌తో పాటూ డివిజన్, మున్సిపల్, మండల స్థాయిలో ఆయా కార్యాలయాల్లో అధికారులు అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.

తంటికొండలో రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం నుంచి తంటికొండ గ్రామంలో వేంకటగిరి కొండపైన వెంకన దేవస్థానం వరకూ రూ.3.75 కోట్లతో నిర్మించనున్న సిసి రోడ్డు, దేవస్థానం ఘాట్ రోడ్డు, సపోర్టింగ్ గోడ పనులను ఆదివారం ప్రారంభమయ్యాయి. ఎంఎల్ఎ జ్యోతుల హయాంలో తంటికొండ దేవాలయం మరింత అభివృద్ధి చెందుతుందని టిడిపి నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ ర్యాలీ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - నిడదవోలు

హైదరాబాద్‌లో ఈ నెల 13న జరిగే ఎంఆర్‌పిఎస్ విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు చెట్టే రామకృష్ణ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి ముఖ్యమంత్రి ఎస్‌సి వర్గీకరణకు సహకరించాలన్నారు. ఈ ఉద్యమానికి సహకరించిన కార్యకర్తలకు, ఉద్యోగులకు రాజకీయ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట దొడ్డిగర్ల బోస్, ఉండ్రాజవరపు విజయకుమార్ ముప్పిడి వేణుమాధవ్, సుదీర్, ముప్పిడి చిన్నబాబు, వారా కళ్యాణ్, ముప్పి డిభాను తదితరులున్నారు.


ధవళేశ్వరం సిఐగా గణేష్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్



ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ సిఐగా తిప్పా గణేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గణేష్ గతంలో ఆయన ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం సిఐగా వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన ఎస్‌పి డి.నరసింహకిషోర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

కార్టూ'నిజం'



అసంపూర్తిగా రోడ్ల నిర్మాణాలు

నిధుల కొరతతో నిలిచిన పనులు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలో అసంపూర్తి రోడ్లతో ప్రయాణికులు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గోపాలపురం నుంచి దొండపూడి గ్రామం వరకు 12.2 కిలోమీటర్ల మేర ఆర్ అండ్ బి రోడ్డు ఉంది. ఇటీవల ఎన్నికల ముందు 8 కిలోమీటర్లు మాత్రమే రోడ్డు వేశారు. 4.2 కిలోమీటర్లు రోడ్డు పనులు చేపట్టకుండా అసంపూర్తిగా నిలుపుదల చేశారు. అలాగే తాళ్లపూడి మండలం గజ్జరం నుంచి గోపాలపురం మండలంలో హుకుంపేట వరకు సుమారు 12.6 కిలోమీటర్లు మేరకు రోడ్డు ఉంది. గతేడాది 7.6 కిలోమీటర్లకు మాత్రమే నిధులు రావడంతో అక్కడ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇంకా సుమారు 5 కిలోమీటర్లు రోడ్డు వేయకుండా అసంపూర్తిగా ఆపేశారు.

గోపాలపురం నుంచి దొండపూడి వరకు 2015కు ముందు రోడ్డు వేశారు. దీంతో రోడ్డు పూర్తిగా శిథిలమైంది. ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడేవారు. గత వైసిపి ఎంఎల్ఎ తలారి వెంకట్రావు హయాంలో రోడ్డు వెడల్పు చేసి రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని చెబుతూ కాలయాపన చేశారు. అనంతర కాలంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జుల మార్పులో తలారి కొవ్వూరుకు వెళ్లారు. దీంతో ఈ పనులను పూర్తిగా గాలికొదిలేశారు.

ఇటీవల జరిగిన ఎన్నికలు ముందు అప్పటి హోం మంత్రి తానేటి వనిత కొవ్వూరు నుండి గోపాలపురానికి ఇన్‌ఛార్జిగా వచ్చారు. ఆమె చొరవతో దీర్ఘకాలికంగా ఉన్న రోడ్డు పనులు చక చక జరిగాయి. ఎనిమిది కిలోమీటర్లుకు మాత్రమే రూ.2.50 కోట్ల నిధులతో పనులు చేపట్టారు. ఇంకా 4.2 కిలోమీటర్లు రోడ్డు వేయకుండా నిలుపుదల చేశారు. ఆ తర్వాత ఎన్నికలు కోడ్ రావడంతో మిగిలిన పనులు కాస్త ఆగిపోయాయి. దొండపూడి నుంచి తొక్కిరెడ్డిగూడెం వరకు మాత్రమే రోడ్డు వేశారు. అక్కడ నుండి గోపాలపురం వరకు 4.2 కిలోమీటర్లు రోడ్డు పనులు ఆగిపోయాయి. నాలుగు కిలోమీటర్లు వరకు నిర్మాణం చేపట్టేందుకు రూ.1.20 కోట్లు నిధులు కావలసి ఉందని ఆర్ అండ్ బి అధికారులు తెలిపారు.

తాళ్లపూడి మండలం గజ్జరం నుండి గోపాలపురం మండలం హుకుంపేట వరకు సుమారు 12.6 కిలోమీటర్లు మేరకు రోడ్డు మార్గం ఉంది. ఈ రోడ్డు వెంబడి అనేక ఫ్యాక్టరీలకు వెళ్లే వాహనాలు నిత్యం తిరుగుతుంటాయి. దీంతో రోడ్డు అధ్వానంగా తయారైంది. సగ్గొండ సర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబు ఈ రోడ్డు నిర్మాణం కోసం తీవ్రంగా శ్రమించారు. ఎట్టకేలకు ప్రభుత్వ నిధులు, మరికొంత ఫ్యాక్టరీ యాజమాన్యాల విరాళాలు కలిపి గజ్జరం నుంచి సగ్గొండ పంచాయతీ గోపవరం వరకు రూ.12.3 కోట్లతో 7.6 కిలోమీటర్లు మేర రోడ్డును నిర్మించారు. అక్కడ నుంచి హుకుంపేట వరకు సుమారు ఐదు కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాల్సి ఉంది. దీనికి రూ.1.50 కోట్లు అవసరమవుతాయి.

ఇటీవల కురిసన వర్షాలకు ఈ రోడ్డు మరింత ఛిద్రంగా మారాయి. కనీస నడిచేందుకు కూడా వీలులేకుండా ఉన్నాయని స్థాకికులు చెబుతున్నారు. భారీ గోతుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వారు చెబుతున్నారు. వెంటనే అసంపూర్తి పనులను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం...

గోపాలపురం నుంచి దొండపూడి రోడ్డులో 4.2 కిలోమీటర్లు రోడ్డు పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకు గాను రూ.1.2 కోట్లు, గజ్జరం నుంచి హుకుంపేట రోడ్డులో ఇంకా ఐదు కిలోమీటర్ల మేర రోడ్డు వేయాల్సి ఉంది దీని రూ.1.50 కోట్లు అవసరం. ఈ మేరకు ప్రతిపాదనలు పంపాం. నిధులు విడుదల కాగానే పనులు చేపడతాం.

- బివి.రమణ, ఆర్ అండ్ బి డిఇఇ

నేరాలు ఘోరాలు

భార్యను గాయపర్చిన భర్తపై కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

భార్యతో గొడవపడి గాయపరిచిన భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండల కేంద్రం ఆత్రేయపురం గ్రామానికి చెందిన చేకూరి ఉమాదేవికి 2007లో అయినవిల్లి మండలం మాగం గ్రామానికి చెందిన చేకూరి శివశేఖర్ రాజుతో వివాహం అయింది. వీరికి ఒక బాబు, ఒక పాప ఉన్నారు. ఇటీవల కాలంలో వీరిద్దరి మధ్య మనస్పర్ధలు పెరిగి తరచూ గొడవలు పడుతున్నారు. సుమారు సంవత్సరం క్రితం ఉమాదేవి పుట్టింటికి వచ్చేసింది. అప్పటినుండి ఆత్రేయపురంలో ఉంటెంది. ఈనెల 9న భర్త శేఖర్ రాజు ఆత్రేయపురం వచ్చి భార్య ఉమాదేవితో గొడవ పడి ఆమెను బెదిరించి చాకుతో గాయపరిచాడు. ఉమాదేవిని కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.శ్రీనివాసు తెలిపారు.


స్వాధీనం చేసుకున్న సారా సామత్రితో సిబ్బంది

3,500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - సీతానగరం

తూర్పు గోదావరి జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు నార్త్ జోన్ డిఎస్పి, కోరుకొండ సిఐ పర్యవేక్షణలో సీతానగరం ఇన్‌ఛార్జి ఎస్ఐ డి.ఆనంద్‌కుమార్ సిబ్బందితో కలిసి గరగలం పాలెం గ్రామ శివారులో ఆదివారం తెల్లవారు జామున సారా బటీలపై దాడులు చేసి 200 లీటర్లు నాటు సారా, రెండు మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 3500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా కాస్తున్న ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నారని ఎస్ఐ తెలిపారు. వారిపై కేసులు నమోదు చేశామన్నారు.


పాడైన కోటిపల్లి-యానాం ఏటిగట్టు రోడ్డు

ప్రమాదాలకు నిలయంగా ఏటిగట్టు

ప్రజాశక్తి-రామచంద్రపురం

గోదావరి ఏటి గట్టు పెద్ద గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా పరిణమించింది. మూడు నెలలుగా మరింత పెద్దదిగా మారి చెరువును తలపిస్తోంది. దీంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుని ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు. కె.గంగవరం మండలంలోని కోటిపల్లి గోదావరి ఏటిగట్టు రోడ్డు యానం వరకు అధ్వానంగా ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాతకోట వద్ద రైల్వే లైన్ వెళ్లే గట్టుపై పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో గోదావరి వచ్చే సమయంలో మరింత ప్రమాదం పొంచి ఉంది. ఈ గొయ్యిని మూడు నెలలుగా ఎవరో పట్టించుకోకపోవడంతో నిత్యం ఇక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సమ్మర్పల్లి వైపు ఇసుక మూటలు వేసిన అధికారులు పాతకోట వైపు పడ్డ ఈ ఏటిగట్టు గొయ్యిని నేటికీ పూడ్చకపోవడంతో రాత్రి సమయాల్లో ఈ గట్టుపై ప్రయాణించాలంటే ప్రయాణికులకు భయపడుతున్నారు. ఇక్కడ ప్రయాణించాలంటే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. కోటిపల్లి నుంచి యానాం వరకు సుమారు 20 కిలోమీటర్లు పొడవైన రహదారి ఆధునికీకరించాల్సిన ఉంది. దీనిపై అధికారులు వెంటనే స్పందించి పాతకోట గ్రామం వద్ద ఏర్పడిన ఏటిగట్టు గొయ్యిని వెంటనే పూడ్చాలని, లేకుంటే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం పొంచి ఉందని ప్రయాణికులు కోరుతున్నారకు. దీనిపై అధికారులు స్పందించి ఈ భారీ గొయ్యిని పూడ్చాలని ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


మంత్రి సుభాష్‌ను సత్కరించిన బాస్కెట్బాల్ అసోసియేషన్

'బాస్కెట్ బాల్' పూర్వవైభవానికి ప్రభుత్వ సహకారం


ప్రజాశక్తి -రామచంద్రాపురం

రాష్ట్రంలో బాస్కెట్‌బాల్ క్రీడకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రభుత్వ సహకారం అందజేస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ 2024-25 సంవత్సరాల్లో బాస్కెట్ బాల్ గేమ్ అభివద్ధికి ప్రణాళికలు రూపొందిస్తునట్టు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. ఆదివారం స్థానిక రాజగోపాల్ థియేటర్ మినీ ఫంక్షన్ హాల్లో రిటైర్డ్ డిఎస్‌పి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జి.మదన్ మోహన్ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి హాజరైన మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ బాస్కెల్‌బాల్ క్రీడాభివద్ధికి ప్రభుత్వం కషి చేస్తుందని వివరించారు. బాస్కెట్ బాల్ అసోసియేషన్ సభ్యులు మంత్రి సుభాష్‌ను సత్కరించారు. సమావేశంలో మారిశెట్టి సత్యనారాయణ, టివిఎస్.రంగారావు, కె.పురుషోత్తం రావు, ఎ.రామచంద్రరావు, బిటి.వర్మ, ఎన్‌వివి.శ్రీనివాసరావు, అవినాష్, ఖాసీంఖాన్, ఎన్‌డి.శ్రీనివాస్, తదితరులుపాల్గొన్నారు.

లంపీ స్కిన్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

పశు సంవర్ధక శాఖ జెడి ప్రకాశరావు





ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

పశువులకు సోకే అతి ప్రమాదకరమైన లంపీ స్కిన్ వ్యాధి పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్తక శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.సూర్యప్రకాశరావు తెలిపారు. జిల్లాలో పశు సంపదను అభివద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జిల్లాలో 76,502 ఆవులు, 2,82,273 గేదెలు, 1,41,229 గొర్రెలు, 1,01,870 మేకలు, 32,48,636 కోళ్లు ఉన్నాయన్నారు. పశువులకు బీమా, వ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత, ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజాశక్తికిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు.

లంపీ స్కిన్ వ్యాధి ఎక్కువగా ఏ జాతి పశువుల్లో సోకుతుంది

ఈ వ్యాధి అధికంగా తెల్లజాతి పశువుల్లో వస్తుంది. పశుపోషకులు చిన్న నిర్లక్ష్యం చేసినా మూగజీవాలు మతి చెందే అవకాశం ఉంటుంది. ఈ వ్యాధి నివారణకు జిల్లాలో ఈ నెల 20 తేదీ నుంచి లంపీ స్కిన్ వ్యాక్సినేషన్ ముమ్మరంగా కొనసాగుతోంది. జిల్లాలో 75,642 పశువులకు ఉచితంగా వ్యాక్సిన్లు వేయడం లక్ష్యం కాగా అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో పశువైద్యులకు, సిబ్బందికి అవగాహన కల్పించాం. ఈ మేరకు వ్యాక్సిన్లు పశువైద్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాము.

ఇప్పటి వరకు ఎన్ని వ్యాక్సిన్లు వేశారు

జిల్లాలో ఇప్పటి వరకూ సుమారు 40 వేలకుపైనే వ్యాక్సిన్లు వేశాము. ఈ కార్యక్రమం ఈ నెల 18వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై పశు పోషకులకు అవగాహన కల్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నాం.

వ్యాధి ఎలా సంక్రమిస్తుంది.

పశువులను ఆశించే కీటకాల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందుతుంది. వేడి, తేమతో కూడిన వాతావరణం ఉన్న నెలల్లో వ్యాధి వ్యాప్తి ఎక్కువ. జోరీగ, రక్తం పీర్చే ఈగలు, దోమలు, కొడుసుల ద్వారా కూడా వ్యాపిస్తుంది. కొన్నిసార్లు ఈ వ్యాధి సోకిన పశువులతో ఇతర పశువులను ఉంచడం వల్ల వాటికి కూడా వ్యాధి సంక్రమిస్తుంది.

వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయి

పశువుల శరీరంపై చిన్న గడ్డలు, ముద్దలు ఏర్పడతాయి. అధిక జ్వరంతో బాధపడతాయి. కళ్ల నుంచి నీరు కారడం, ముక్కు, నోటి ద్వారా రొంగలు వస్తాయి. శరీరమంతా కణతులు, బొడిపెలు, రక్తం కారి పుండ్లు ఏర్పడతాయి. పక్కటెముకలు, కాళ్లు, వెన్నె ముక, పొదుగు, కనురెప్పలు తదితర భాగాలకు వ్యాప్తి చెందుతాయి. వీటి ప్రభావం 7 నుంచి 12 రోజుల వరకూ ఉంటుంది. పశువులు బలహీనంగా, అలసటగా కనిపిస్తాయి. వ్యాధి సోకిన పశువులు తక్కువగా పాలు ఇస్తాయి.

చికిత్స విధానం ఏమిటి

వ్యాధి సోకిన పశువులను మిగిలిన పశువుల నుంచి వేరు చేయాలి. వ్యాధి తీవ్రత బట్టి మందులు వాడాలి. జ్వరం, కాళ్ల వాపు అధికంగా ఉంటే తగిన యాంటీ ఇన్ ఫ్లమేటరీ మందులు అందించాలి. గంతలతో కూడిన గాయాలు ఏర్పడితే యాంటీ బయాటిక్‌తో కూడిన ఆయింట్మెంట్ వాడాలి. దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా పశువైద్యుని సూచన మేరకు మందులు వినియోగించాలి. హోమియో, ఆయుర్వేద మందులు తిప్పతీగ తదితర వ్యాధి నిరోధక మందులను వాడడం ఉపయోగకరం.

వ్యాధి నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలి

బాధ్యత పశువులను ఇతర ప్రదేశాలకు తరలించకూడదు. వ్యాధి ప్రభావిత ప్రాంతం నుంచి పశువులు వలస వెళ్లకుండా చూసుకోవాలి. కీటకాల నియంత్రణ దోమతెరలను ఉపయోగించడం, పశువుల తొట్టెలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి.

పాడి రైతుల సంక్షేమానికి ఏ చర్యలు తీసుకుంటున్నారు

పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కషి చేస్తోంది. ఇప్పటికీ గ్రామాల్లోని పశువైద్య సహాయకులను నియమించడంతో వారు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఇప్పటివరకూ మూగజీవాలు అనారోగ్యానికి గురైతే రైతులు అందుబాటులో ఉన్న పశు వైద్య సిబ్బందిని సంప్రదించి మందులు వేసేవారు. దీంతో కొన్ని పశువులు కోలుకునేవి. మరికొన్ని గుర్తు తెలియని వ్యాధితో చనిపోయేవి.

పశువుల ఆరోగ్యానికి ఎటువంటి భరోసా కల్పిస్తున్నారు.?

పశువుకు సంక్రమించిన వ్యాధి ఏమిటో కచ్చితంగా తెలిసేది కాదు. వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల (లేబొరేటరీ) అందుబాటులో లేకపోవడంతో పశువులు చనిపోయి రైతులు నష్టపోయేవారు. లేబరటరీలు ఉంటే పశువులను కాపాడవచ్చని గ్రహించిన ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికీ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. తద్వారా మూగజీవాల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోంది.


రఘుదేవపురంలో అసంపూర్తి రోడ్డు నిర్మాణం


బుర్రిలంక వద్ద జాతీయ రహదారిపై నిలిచిన వర్షం నీరు

అసంపూర్తి రహదారితో ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి - సీతానగరం

రాజమండ్రి సీతానగరం నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి రూ.కోట్లు వెచ్చించి నిర్మాణం చేపట్టారు. కాతేరు నుండి ముగ్గళ్ళ వరకు ఇంకా పూర్తి స్థాయిలో పనులు జరగకకపోయినా కాస్త ఉపశమనం కలిగింది. ముగ్గళ్ళ నుండి సీతానగరం రహదారి నిర్మాణం పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ అరకొర పనులతో వంతెన నిర్మాణం చేపట్టి వదిలేశారు. రాపాక వంతెన వద్ద ఏప్రిల్‌లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగి యువకుడు మృతి చెందాడు. మునికూడలి, ముగ్గళ్ళ గోదావరి మాత విగ్రహం వద్ద, రఘుదేవపురం హర్షవర్ధన్ స్కూల్ వద్ద ఇంకా పనులు పూర్తి కాలేదు. అరకొర పనులతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. చినుకు రాలితే రహదారి అంతా నీటితో నిండుపోయి గోతుల్లో పడి ఇప్పటికే పలువురు వాహనచోదకులు మృత్యువాత పడ్డారు. నిర్మాణ పనులు చేపట్టి వదిలేయడంతో ప్రత్నామ్నాయం లేక వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం గోతులు పూడ్చకుండా ఆర్ అండ్ బి అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం మత్తు వదల్లేకపోతున్నారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజాసంఘాలు కోరుతున్నారు.

జాతీయ రహదారిపై పొంచివున్న ప్రమాదం

ప్రజాశక్తి - కడియం

కడియం మండలం బుర్రిలంక నాలుగు లైన్ల జాతీయ రహదారి చిన్నపాటి వర్షానికి ముంపుకు గురవ్వడంతో నీరు నిలిచిపోతోంది. రావులపాలెం నుంచి రాజమండ్రి వైపుకు వచ్చే వాహనదారులు నీరు కారణంగా ప్రమాదాల బారిన పడుతున్నారు. బుర్రిలంక వంతెన దగ్గర కొంత మేర మలుపు ఉండడంతో రహదారి వర్షపు నీటితో మునిగి ఉంటుంది. శుక్రవారం కురిసిన వర్షానికి అటుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. నిత్యం ఈ రహదారిపై వేలాది వాహనాలు వెళుతుంటాయి. ఈ సమస్య ఎన్నో ఏళ్ల నుంచి ఉన్నా నేషనల్ హైవే నిర్వహణా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఎంతోమంది ముంపునీటి బారిన పడి క్షతగాత్రులుగా మారారు. ఉన్నతాధికారులు తక్షణమే దీనిపై స్పందించి శాశ్వత పరిస్కారానికి తగిన చర్యలు చేపట్టాలని, స్థానిక రైతులు, ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.



ప్రశంసాప్రతాలు అందకున్న చిన్నారులతో కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

ముగిసిన కోనసీమ బాలోత్సవం

ప్రజాశక్తి-కొత్తపేట

ఆదివారం కోనసీమ బాలోత్సవం ఆదివారం ముగిసింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఎల్ఎ బండారు సత్యానందరావు మాట్లాడుతూ పిల్లలకు దేంట్లో ఆసక్తి కలదో గుర్తించి ప్రోత్సహించడానికి ఈ పిల్లల పండుగ ఒక వేదికగా ఉందని తెలిపారు. భవిష్యత్తు సమాజాన్ని చూడాలంటే నేటి పిల్లలే రేపటి బావి భారత పౌరులని, భవిష్యత్తు సమాజం నైతిక విలువలు కూడిన సమాజం కావాలంటే విద్యా వంతులైన పిల్లలను తీర్చి దిద్దలన్నారు. స్కూల్ టీచర్ల సహాయ సహకారాలు, న్యాయ నిర్ణేతల సహకారాలు వల్ల పిల్లలు ప్రదర్శించిన నత్య ప్రదర్శనలు, నాటికలు, ఎంతగానో అలరించాయన్నారు. మనం ట్రస్ట్ మరియు జితేంద్ర సేవా ఫౌండేషన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పిల్లల పండుగ అలంరించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొత్తపేటలో రెండు రోజులపాటు పండుగ వాతావరణం ఏర్పడిందని అన్నారు. బాలోత్సవంలో శని, ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ప్రదర్శనలు నిర్వహించిన విద్యార్థులకు ప్రథమ, ద్వితయ, తృతీయ బహుమతులు మరియు విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలను ఎంఎల్ఎ అందజేశారు. కోనసీమ బాలోత్సవం అధ్యక్షుడు కర్రి కాశీ విశ్వనాథం, మనం ట్రస్ట్ ఛైర్మన్ కట్టా వీరబాబు, జితేంద్ర సేవా ఫౌండేషన్ ఛైర్మన్ మట్టపర్తి జితేంద్ర, మనం ట్రస్ట్ ఇన్చార్జి యండూరి పవన్ కుమార్, గంగుమల్లరాజు, షేక్ అబ్దుల్ సత్తార్, కె.మణిలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యమంలో స్థానిక సర్పంచ్ బి.జయలక్ష్మి, భాస్కరరావు, శిల్పి రాజ కుమార్ వడయార్, మండల టిడిపి అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, పాలూరి సత్యానందం, రెడ్డి రామకష్ణ, ఎంఇఒ ఎం.హరిప్రసాద్, సత్తిరాజు ఆదిత్య కిరణ్ ,తోట వెంకటేశ్వరరావు,అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చెముడులంకలో స్వామితాత ప్రథమ వర్ధంతి

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని చెముడులంకకు చెందిన సీనియర్ రాజకీయ నేత, ప్రముఖ పొగాకు వర్తకులు దొండపాటి స్వామి తాత ప్రథమ వర్ధంతి ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావు, ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం హాజరై ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్వామితాతతో ఉన్న అనుబంధాన్ని వారు గుర్తు చేసుకుని, ఆయన కుమారులైన వెంకట్రామయ్య, శ్రీరాములను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు తమ్మన భాస్కర్రావు, మాజీ ఎంపిటిసి సభ్యుడు నాగిరెడ్డి వెంకటేశ్వర్రావు, ఆలమూరు మాజీ డిసి ఛైర్మన్, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి వెంకటరత్నం, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు మల్లిపూడి ఉదయభాస్కర్రావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలను అరికట్టేందుకు మీడియా సహకరించాలి

ప్రజాశక్తి-ఆలమూరు

సమాజంలో జరిగే నేరాలను అరికట్టడానికి మీడియా సహకారం తప్పక ఉండాలని, దీంతో క్రైమ్ రేట్ కట్టడి మరింత సులువు అవుతుందని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వారి స్థానాల్లో ఇద్దరినీ ఆలమూరు ప్రెస్ క్లబ్ సభ్యులు మర్యాదపరంగా కలుసుకొని పూలమాలలతో సత్కరించారు. ఈసందర్భంగా శాంతికి చిహ్నమైన మొక్కలను బహుమతిగా అందించారు. క్రైమ్ తగ్గించడానికి పోలీస్ శాఖకు మా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ప్రెస్‌క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


ఎన్.కొత్తపల్లిలో పివి.రావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

పివి.రావు ఆశయ సాధకు కృషి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా తుది శ్వాస వరకూ మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పివి రావు పోరాటం చేశారని మాల మహానాడు మండల కన్వీనర్ కొంకి వెంకట బాబ్జి అన్నారు. పివి. రావు ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఎన్.కొత్తపల్లిలో ఆదివారం పివి.రావు విగ్రహానికి మాల మహానాడు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌సి వర్గీకరణ ఉద్యమంలో అమరులైన మత వీరులకు జోహార్లు అర్పించారు. ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమన్నారు. అనంతరం అమలాపురంలో వర్గీకరణపై జరిగే నిరసన కార్యక్రమానికి మాల మహానాడు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మాలలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు కుంచే చిన్ని, కొంకి బాలకష్ణ, నేరేడుమిల్లి సత్తిబాబు, గోసంగి శ్రీను, దోనిపాటి రాంజీ, కొంకి బాబురావు, గోసంగి సత్యనారాయణ, నల్లా రవి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం మండలంలో, కె.గంగవరం మండలంలో అన్ని గ్రామాల్లో గల సర్పంచులకు ఈనెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నమని రామచంద్రపురం ఎంపిడిఒ శ్రీరామచంద్రమూర్తి, కె.గంగవరం ఎంపిడిఒ ఎన్.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం నుంచి బుధవారం వరకు ఈ శిక్షణ ఉంటుందని శిక్షణలో పారిశుధ్య నిర్వహణ, చెత్త నుండి సంపద, వీధిలైట్ల నిర్వహణ తదితర కార్యక్రమాలపై ఉంటుందని గ్రామ కార్యదర్శులు ఈ శిక్షణకు హాజరు కావాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తులు ఆనందరావు

వైసిపి పాలనలో అమలుకాని అంబేద్కర్ రాజ్యాంగం

ప్రజాశక్తి-అమలాపురం

గత వైసిపి అయిదేళ్ల పాలనలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాకుండా ఏపిలో రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేశారని ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు విమర్శించారు. ఆదివారం ఎంఎల్ఎ ఆనందరరావు విలేకరులతో మాట్లాడుతూ అమరావతిలో అంబేద్కర్ విగ్రహాన్ని రూ.178 కోట్లతో నిర్మించి, రూ.250 కోట్లు స్వాహా చేశారని విమర్శించారు. శిలాఫలకం మీద అంబేద్కర్ పేరు ఉండవలసిన చోట వైఎస్.జగన్ పేరు వేయించుకుని రాజ్యాంగ నిర్మాతనే అవమానించిన జగన్‌కు దళితులు పట్ల చిత్తశుద్ధి లేదని అన్నారు. ఈ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాలకు కూడా వైసిపి రంగులు వేసిన హేయమైన పార్టీ వైసిపి అని అన్నాయరు. ఒకటి కాదు రెండు కాదు 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి దళితులకు తీవ్ర అన్యాయం చేసింది జగనే అని ఆనందరావు అన్నారు. సంపద సష్టించాలని అంటే ప్రజలకు భారమైన పనులు వేసి వసూలు చేసింది జగనేనని ఆనందరావు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గణేశ ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కాకినాడ నగర గణేశ ఉత్సవ సమితి సమావేశం స్థానిక గంగరాజు నగర్ 3వ వీధిలో ఆదివారం నిర్వహించారు. సమితి కో కన్వీనర్ రంభాల వేంకటేశ్వర రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి సమితి కన్వీనర్ యెనిమిరెడ్డి మాలకొండయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సమితి గౌరవాధ్యక్షుడు దూసర్ల పూడి రమణరాజు మాట్లాడుతూ పర్యావరణానికి హానికరం కాని జలకాలుష్యానికి గురయ్యే విషపూరిత రంగులు వాడని గణపతి విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. బొలిశెట్టి వేంకట రామకృష్ణ, పెండెం సత్యనారాయణ, దిలీప్ కుమార్ సదనాని, గోడి వెంకట్, నండూరి సత్తి బాబు, పితాని లీలావతి, కవికొండల చలపతి, కండిల్లి వెంకట్ పాల్గొన్నారు.

ఘనంగా గోవమ్మ తల్లి వసంతోత్సవం

ప్రజాశక్తి- తాళ్లరేవు

గాడిమొగ పంచాయితీ బాబా నగర్ సమీపంలోని గోవమ్మ తల్లి వసంతోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయం వద్ద పచ్చని పందిరి వేసి, చిన్నారులకు ఆటలు, పాటలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారులు సందడి చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సంగాడి కామేశ్వరరావు, చింతా లక్ష్మణ స్వామి వర్మ ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

నేటి నుంచి రద్దయిన రైళ్ల పునరుద్ధరణ

ప్రజాశక్తి- సామర్లకోట

సుమారు నెలరోజుల పైబడి దక్షిణ మధ్య రైల్వే పలు కారణాలతో రద్దు చేసిన ఎనిమిది రైళ్లను సోమవారం నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చింది. మేరకు వివరాలను సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ తెలిపారు. విశాఖపట్నం కడప తిరుమల ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం గుంటూరు ఎక్స్‌ప్రెస్, విజయవాడ విశాఖపట్నం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, గుంటూరు విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్, తిరుపతి విశాఖపట్నం డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, రాజమండ్రి విశాఖపట్నం మెమో, గుంటూరు రాయగడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు సోమవారం నుండి రెండు వైపులా రాకపోకలు సాగిస్తాయన్నారు. రైల్వే ప్రయాణికులు మార్పును గమనించి సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారులు విజ్ఞప్తి చేశారు.

మరిడమ్మ జాతరకు యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర ముగింపు సందర్భంగా, శ్రావణమాసం మొదటి ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు అమ్మవారిని దర్శించుకున్నారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడకుండా ఆలయ అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామ్మోహనరావు ఆధ్వర్యంలో సిబ్బంది సేవలు అందించారు.

ముత్యాలమ్మకు ఊయల అందజేత

ప్రజాశక్తి - తాళ్లరేవు

పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి ఆలయానికి యానాంకు చెందిన సలాది జానకిరామ్ రమ్య దంపతులు ఆదివారం నాలుగు కేజీల వెండి ఊయలను బహూకరించారు. తమకు కుమారుడు జన్మించినప్పుడు నాలుగు కేజీల బరువు ఉండటంతో ఆ మేరకు అమ్మవారికి ఊయల బహుకరిస్తామని మొక్కుకున్నట్టు తెలిపారు. జానకిరామ్ తల్లిదండ్రులు యేసు, వెంకటేశ్వరరావు, సోదరుడు లక్ష్మణ్ సందీప్, బంధువులు వీళ్ళ వీర, సత్యనారాయణ దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జానకిరామ్ రమ్య దంపతులు పలువురికి వస్త్ర దానం, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉంగరాల వెంకటేశ్వరరావు, పంపన విష్ణు, చంద్రరావు దంపతులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.


చెముడులంకలో నిర్వహించిన గరగోత్సవంలో పాల్గొన్న యాత్రికులు

ఘనంగా గరగోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి - ఆలమూరు

చెముడులంక ప్రధాన కాలువ ఒడ్డున ఉన్న శ్రీవిజయ దుర్గ అమ్మవారి ఆలయం వద్ద కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గరగోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఆలయం నిర్మించి మూడు ఏళ్లు పూర్తయిన సందర్భముగా గ్రామంలో గరగ ఊరేగింపు, జాతర, తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి అమ్మవారి జాతర చేసేందుకు వేద పండితులు, నిర్వాహక కమిటీ నిశ్చయించినారన్నారు. 18న జాతర, 19న తీర్థ నైవేద్యాలు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నైవేద్యంలో ఎటువంటి జంతుబలి లేదని, అందరూ పాటించాలని కమిటీ స్పష్టం చేసింది. ముఖ్యంగా అమ్మవారికి బూర్లు, పరమాన్నం, వడపప్పు, పానకం నైవేద్యముగా మాత్రమే సమర్పించాలని ఆలయ కమిటీ కోరింది. కార్యక్రమంలో గురు భవాని తమ్మన వెంకటేశ్వరరావు, పాలూరి చిరంజీవి, రాయుడు వెంకటేష్ దంపతులు, అన్నందేవుల కిట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.